

వర్షపాతం నమోదు ఇలా..

జిల్లావ్యాప్తంగా 670.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. శనివారం మాత్రం 44.7 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. మిగతా మండలాల్లో చూసుకుంటే.. వీరఘట్టంలో 45.6, సీతంపేటలో 72.6, భామినిలో 45.6, పాలకొండలో 51.6, కొమరాడలో 25.2, గుమ్మలక్ష్మీపురంలో 22.8, కురుపాంలో 70.8, జియ్యమ్మవలసలో 34.6, గరుగుబిల్లిలో 64, పార్వతీపురంలో 47.8, మక్కువలో 23, సీతానగరంలో 44.6, బలిజిపేటలో 59.6, సాలూరులో 32.6, పాచిపెంటలో 29.8 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

తెరిపిచ్చిన వాన

- శాంతించిన వరుణుడు
- జిల్లా అంతటా మబ్బుల వాతావరణం
- జలాశయాలకు జలకళ
- పంట పొలాల్లోకి నీరు
- నిండుగా వాగులు, వంకలు
- ఖరీఫ్ పనుల్లో రైతులు



గరుగుబిల్లి: పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు

గరుగుబిల్లి, జూలై 20 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేగావతి, సువర్ణముఖి, గోముఖి తదితర నదులతో పాటు పలు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. దీంతో ఖరీఫ్ రైతులు ఉభాలుకు సిద్ధమవుతున్నారు. కాగా శనివారం జిల్లాలో చాలాచోట్ల వర్షం పడలేదు. కొన్నిచోట్ల మాత్రమే ఓ మోస్తరుగా వాన కురిసింది. మొత్తంగా వాతావరణం కాస్త తెరిపిచ్చింది. గత మూడు, నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు ఇబ్బంది పడిన జిల్లావాసులు కాస్త ఊరట చెందారు. కాగా వర్షాలు ఇంకా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు సూచించారు.



సాలూరు మండలం పుణికిలవలసలో నేలవాలిన మొక్కజొన్న పంట

నిలకడగా నాగావళి

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి నదిలోకి వరద పోటెత్తుతోంది. శనివారం నదిలోకి 2 వేల క్యూసెక్కులకు పైగా రాగా.. దిగువ ప్రాంతానికి 1,929 క్యూసెక్కులను విడుదల చేశారు. అధికంగా వరద రావడంతో ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు తెరచి కిందకు నీటిని మళ్లిస్తున్నారు. ప్రధాన గేట్లు నుంచి వరదను మళ్లించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్‌లు తెలిపారు.



భామిని: సింగిడి రహదారి ఇలా..

గుంతల్లో నీరు... రాకపోకలు ఎలా?

భామిని: మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బత్తిలి-కొత్తూరు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గోతుల్లో వర్షపునీరు చేరడంతో.. రోడ్డు ఎక్కడుందో వెతుక్కో వాల్సిన పరిస్థితి. దీంతో వాహనచోదకులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. సింగిడి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన భారీ గుంతల్లో నీరు చేరడంతో.. వాహనదారులు ఈ మార్గం దాటేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మొత్తంగా ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే వారు బెంబేలెత్తిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మరమ్మతుల పేరిట ఉన్న రోడ్డును తవ్వి డస్ట్ మెటల్ వేశారు. ఆ తర్వాత పనులేవీ చేపట్టలేదు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఇదే మార్గంలో నిత్యం చత్తీస్‌ఘడ్, ఒడిశా నుంచి విశాఖకు భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ ప్రమాదం సంభవించకముందే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న

సాలూరు రూరల్: ఈదురుగాలులతో వర్షం కురవడంతో శనివారం కూర్మరాజుపేట పంచాయతీ పుణికిలవలసలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో గిరిజన రైతు వలిసే కృష్ణ లబోదిబోమన్నాడు. కౌలుకు తీసుకొని రూ.20 వేలతో సాగు చేపట్టానని, అయితే గాలుల కారణంగా పంట పూర్తిగా నేలకొరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు పరిశీలించి.. తనకు న్యాయం చేయాలని కోరాడు. వర్షాల కారణంగా మండలంలో పంట నష్టాలు తమ దృష్టికి రాలేదని ఏవో అనురాధ పండా తెలిపారు. ఈ వానలతో పత్తి, మొక్కజొన్నకు మేలు జరుగుతుందన్నారు. కొన్ని చోట్ల వరి ఉభాలు ప్రారంభమయ్యాయని చెప్పారు.



పెద్దగెడ్డ నుంచి నీరు విడుదల

పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయం నీటి మట్టం పెరిగింది. దీంతో శనివారం మధ్యాహ్నం ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు నుంచి నదీ ప్రవాహంలోకి నీటిని విడిచిపెట్టారు. పెద్దగెడ్డ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 213.3 మీటర్లు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీటి మట్టం పెరిగింది. ప్రస్తుత నీటి మట్టం 213.4 మీటర్లుగా ఉంది. దీంతో సంబంధిత అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే వద్ద రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కులను దిగువకు విడిచిపెట్టారు.

ఇద్దరు గిరిజనుల ఆత్మహత్య

- వివాహేతర సంబంధమే కారణం
- కేసు నమోదు చేసిన పోలీసులు

సీతంపేట: చిన్నబగ్గ పంచాయతీ జరడకాలనీకి చెందిన బిడ్డిక అన్నపూర్ణ (35), తాడంగి వెంకటరావు (37) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివాహేతర సంబంధమే వీరి ఆత్మహత్యకు కారణమని అన్నపూర్ణ చిన్నాన్న బిడ్డిక నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. జరడకాలనీకి చెందిన తాడంగి కృష్ణారావు, నీలకంఠాపురం పంచాయతీ శాలిడాంగూడకు చెందిన అన్నపూర్ణ 2014లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి వీరికి నలుగురు పిల్లలు కాగా ఇద్దరు మృతి చెందారు. అయితే, అన్నపూర్ణకు జరడకాలనీకి చెందిన వెంకటరావుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 3న రాత్రి భోజనం చేసిన అనంతరం అన్నపూర్ణ తన భర్త కృష్ణారావు, పిల్లలతో కలిసి నిద్రపోయింది. మరుసటి రోజు ఉదయం కృష్ణారావు నిద్రలేచి చూడగా భార్య కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన వెంకటరావు కూడా కనిపించకపోవడంతో అనుమానం ఏర్పడింది. దీనిపై 8న సీతంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 14న హైదరాబాద్‌లో ఉంటున్న తుంబలి గ్రామానికి చెందిన కొండగొర్రె సుమంత్ తన స్నేహితుడు జరడకాలనీకి చెందిన మీనక సూర్యారావుకు ఫోన్ చేసి వెంకటరావు, అన్నపూర్ణ హైదరాబాద్‌లో ఉన్నారని చెప్పాడు. ఈ విషయాన్ని సూర్యారావు.. అన్నపూర్ణ భర్త కృష్ణారావుకు తెలియజేశాడు. దీంతో 16న జరడకాలనీకి చెందిన బిడ్డిక నీలయ్య, మీనక గోపాల్, తాడంగి శివకుమార్ తదితరులు హైదరాబాద్‌కు కారులో వెళ్లారు. వెంకటరావు, అన్నపూర్ణకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని కారులో ఎక్కించుకుని 18వ తేదీ మధ్యాహ్నం గ్రామానికి బయలుదేరారు. 19న సీతంపేట మండలం కుశిమి గ్రామ సమీపంలో అన్నపూర్ణ మూత్రవిసర్జన కోసం కారు ఆపమని చెప్పింది. దీంతో వాహనం ఆపడంతో ఆమె కిందకు దిగి ఓ చోటకు వెళ్లింది. కొంతసేపటి తరువాత వెంకటరావు కూడా దిగి అక్కడకు వెళ్లాడు. ఇద్దరూ పురుగు మందు తాగి వచ్చి కారు ఎక్కారు. అయితే, కొద్ది సేపటి తరువాత వారు వాంతులు చేసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదే కారులో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై అన్నపూర్ణ చిన్నాన్న బిడ్డిక నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

ఐదేళ్ల నిర్లక్ష్యం..

- గుమ్మలక్ష్మీపురం మినీ స్టేడియం నిర్మాణాన్ని పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- సక్రమంగా బిల్లులు చెల్లించని వైనం..
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన పనులు
- ఆందోళనలో గిరిజన క్రీడాకారులు
- నూతన ప్రభుత్వం స్పందించాలని విన్నపం



మినీ స్టేడియం ఇలా..

గుమ్మలక్ష్మీపురం: గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా గుమ్మలక్ష్మీపురంలో మినీ స్టేడియం నిర్మాణానికి బ్రేక్ పడింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్ల కాలంలో నిధులేవీ కేటాయించకపోవడంతో స్టేడియానికి మోక్షం లభించలేదు. ఫలితంగా గిరిజన క్రీడాకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. అసలు గుమ్మలక్ష్మీపురంలో స్టేడియం నిర్మాణం జరిగితే.. ఈ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే వీలుంది. గతంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చెప్పిన విధంగా ఇక్కడ అకాడమీ ఏర్పాటు చేసి.. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో యువతకు శిక్షణ ఇస్తే.. వివిధ క్రీడల్లో మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గుమ్మలక్ష్మీపురంలో మినీ స్టేడియం నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అప్పట్లో దీని కోసం కోటి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. నాడు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన కూడా చేశారు. ఈ మేరకు పనులు చురుగ్గా సాగాయి. అయితే ఆ తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్లలో దాని నిర్మాణం పూర్తికి ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సగం నిర్మాణంలో నిలిచిపోయిన భవనాలు కూడా అధ్వానంగా మారాయి. దీనిపై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గిరిజన క్రీడాకారులు కోరుతున్నారు. పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. రన్నింగ్ ట్రాక్, ఇతర వస్తువులు సమకూర్చి, కోచ్‌లను నియమించాలని, వివిధ క్రీడాల్లో గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

నిధుల కొరత కారణంగా స్టేడియం నిర్మాణం పూర్తికాలేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- జగదీష్, ఎంపీడీవో, గుమ్మలక్ష్మీపురం

వణికిస్తున్న జ్వరాలు



మామిడిపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

సాలూరు రూరల్, జూలై 20: సాలూరు మండలంలోని పలు గ్రామాలను జ్వరాలు వణికిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మలేరియా, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికే ఇటికవలస, మావుడి తదితర గ్రామాలకు చెందిన పలువురు మామిడిపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మలేరియా జ్వరంతో శనివారం మామిడిపల్లి పీహెచ్‌సీలో చేరారు. తోణాం, బాగువలస పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో జ్వరాల సమాచారాన్ని వైద్యసిబ్బంది సేకరిస్తున్నారు.

- **అప్రమత్తంగా ఉండాలి**

భామిని: సీజనల్ జ్వరాలపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి ఆదేశించారు. శనివారం బత్తిలి, భామిని పీహెచ్‌సీలను సందర్శించి హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. మనుమకొండ, భామిని పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనంతరం ఆమె మందుల నిల్వలు, వైద్య శిబిరాలపై ఆరా తీశారు.

ఐటీడీఏ పీవోలకు బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పార్వతీపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి)/సీతంపేట: జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలకు బదిలీలయ్యాయి. పార్వతీపురం ఐటీడీఏ పీవోగా సేదు మాధవన్ నియామకమయ్యారు. ఆయన 2020ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఐటీడీఏ పీవోగా ఇక్కడకు వస్తున్నారు. మాధవన్ భార్య శోభిక ప్రస్తుతం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పీవో విష్ణుచరణ్‌కు నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యింది. సీతంపేట ఐటీడీఏ పీవోగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన టి.రాహుల్‌కుమార్‌రెడ్డి నియమకమయ్యారు. ఆయన స్వస్థలం కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం గ్రామం. కాగా ప్రస్తుతం ఇక్కడ పీవోగా విధులు నిర్వర్తిస్తున్న శుభంబన్సాల్‌ను తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ.. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



పార్వతీపురం పీవోగా మాధవన్



సీతంపేట పీవోగా రాహుల్‌కుమార్ రెడ్డి

గిరిజన రైతులను ప్రోత్సహించాలి

- లక్ష్యానికి మించి పనిచేయండి
- అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం



పార్వతీపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉద్యాన సాగులో గిరిజన రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. ఉద్యానశాఖ అధికారులు లక్ష్యానికి మించి పనిచేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచడానికి అనుకూలమైన భూములను గుర్తించాలని సూచించారు. ఈ సాగు చేయడానికి ఆసక్తి చూపే గిరిజన రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట నుంచి ఆదాయం వచ్చే వరకు మూడేళ్ల పాటు అంతర పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. మొక్కలు నాటి, వాటికి డ్రిప్ మంజూరు చేయాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 15 నాటికి 50 శాతం లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా ఉద్యాన శాఖాధికారి వి.రాధాకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉందని తెలిపారు. ఈ సంవత్సరం నాలుగు వేల ఎకరాల భూమి సాగుకు అనుకూలమైనదిగా గుర్తించామని చెప్పారు.



గిరి ప్రదక్షిణానికి హాజరైన భక్తులు

సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం

వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణకు శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో నగరం జనసంద్రమైంది. భక్తులు ఏటా ఆషాఢమాసం శుక్లపక్ష చతుర్దశినాడు సింహగిరి ప్రదక్షిణ (సుమారు 32 కిలోమీటర్లు) ప్రారంభించి మరుసటిరోజు పౌర్ణమినాడు ముగిస్తుంటారు. ఇది కొన్ని సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది భారీగా తరలివచ్చారు. సింహాచలం దేవస్థాన అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం సాయంత్రం పూజలు చేసిన అనంతరం అప్పన్న పుష్పరథానికి జెండా ఊపడంతో సింహగిరి ప్రదక్షిణ ఉత్సవం లాంఛనంగా ప్రారంభమైంది. భక్తులు తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణకు ఉపక్రమించారు. ఉత్సవంలో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అధికారుల ప్రాథమిక అంచనా.

- సింహాచలం



గిరి ప్రదక్షిణాన్ని ప్రారంభిస్తున్న సింహాచలం దేవస్థాన అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు

వివరాలు.. 7లో



నరకాసుర వధకై సమరం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. శనివారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోలీసాఫీసర్‌గా అయన క్రౌర్యాన్ని పలికించిన తీరు ఆకట్టుకుంది. సూర్య పాత్రను నరకాసురుడితో పోల్చుతూ, అతన్ని ఎదుర్కోవడానికి వస్తున్న హీరో హీరోయిన్ల పాత్రలను శ్రీకృష్ణుడు, సత్యభామతో పోల్చిచూపడం ఆసక్తిని పెంచింది. ఆగస్టు 29న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: మురళీ జీ, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్

మాస్టర్స్ పట్టా అందుకున్న అనా కొణిదెల

స్నాతకోత్సవానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆమెకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో శనివారం వైభవంగా జరిగిన స్నాతకోత్సవంలో ఆమె పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానంలో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి వెళ్లిన పవన్.. మాస్టర్స్ పట్టా పొందిన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్‌లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికి తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే ఆమె మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి



మాస్టర్స్ డిగ్రీ సాధించారు. కాగా, పవన్ దంపతులు సింగపూర్ నుంచి నేడు విజయవాడ రానున్నారు.

- అమరావతి, (ఆంధ్రజ్యోతి)

కమిటీ కుర్రోళ్లు వస్తున్నారు



గ్రామీణ నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, శ్రావ్య, విషిక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా నిహారికా కొణిదెల మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై వస్తున్న తొలి చిత్రమిది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహితులతో సెలబ్రేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంద'ని చెప్పారు.

ఆగస్టు నుంచి ఆరంభం



'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిజైనర్ నీరజ్ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. హైదరాబాద్‌లో 30 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: జ్ఞానశేఖర్ వీ.ఎస్, సంగీతం: థమన్ ఎస్.ఎస్.

కల్కి బృందానికి నోటీసులు



'కల్కి 2898 ఏ.డీ' మేకర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాలో నటించిన ప్రభాస్, అమితాబ్ బచ్చన్, ఇతర నటులతో పాటు మేకర్స్‌కు మాజీ కాంగ్రెస్ నాయకుడు, కల్కి ధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రసాద్ లీగల్ నోటీసులు పంపారు. "ఈ సినిమా భారతీయ ఇతిహాసాల్లోని విశ్వాసాలను దెబ్బతీసేలా ఉంది. ఇందులో హిందూ పురాణాల్లో ఉన్న విధంగా కాకుండా.. వాటిని వక్రీకరించారు. విష్ణుమూర్తి చివరి అవతారం 'కల్కి'ని పవిత్ర గ్రంథాలను కించపరిచేలా చిత్రీకరించారు. ఇది దేశంలో కోట్లాది సంఖ్యలో ఉన్న భక్తులను అయోమయానికి, గందరగోళానికి గురిచేసేలా ఉంది" అని ఆచార్య ప్రసాద్ ఈ నోటీసులో ఆరోపించారు.



ఆకట్టుకునే చిన్న కథ



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్నాడు. హీరో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రంలో విశ్వదేవ్ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ప్రసాద్ అనే మధ్యతరగతి తండ్రి పాత్రలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. ఇది చిన్న కథ కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని మేకర్స్ తెలిపారు. వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: టి.సి ప్రసన్న

మహిళలు మెచ్చిన పేకమేడలు




వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేకమేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా అన్ని చోట్లా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "భావోద్వేగంతో నిండిన మంచి సినిమాను తీశారని చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారు" అని అన్నారు. "మంచి కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి రుజువు చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఇలాంటి మరిన్ని సినిమాలు నిర్మించడానికి ఉత్సాహం ఇచ్చింది" అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ చక్కగా ఉంది. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు. "ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత పారమళ్ల లింగయ్య అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కొడగంటి వీక్షితవేణు, కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.







ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

పొలాల్లో నీరు.. రైతుల బేజారు

- నీట మునిగిన పంటలు
- లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీరు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


రేగిడి:వన్నలి-చాటాయివలస మధ్య ఉప్పొంగిన బండిగెడ్డ


భోగాపురం: దల్లిపేటలో నీటమునిగిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


వంగర: మగ్గూరులో నీట మునిగిన పంటపొలాలు

జిల్లాలో గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు పంటపొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎద, నారు మడులు మొలకెత్తే దశలో ఉన్నాయి. ప్రస్తుతం రోజుల తరబడి నీరు నిల్వఉంటే కుళ్లిపోతాయని రైతులు బేజారవుతున్నారు. పలు చోట్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది.

● **భోగాపురం:** రెండు రోజులుగా కురిసిన వర్షాలకు భోగాపురం, నందిగాం, పోలిపల్లి, దల్లిపేట, తదితర గ్రామాల్లో పంట నీట మునిగాయి. నారుమడులు, ఎద పంటపొలాలకు నీటిలోనే ఉన్నాయి.నీరు ఎక్కువ రోజులునిల్వ ఉంటే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భోగాపురం, దల్లిపేటలో జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు, సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభూషణరావు, ఏవో వి.హరికృష్ణ శనివారం పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. మండలంలో సుమారు10 ఎకరాలు నారు మడులు, 40 ఎకరాలు ఎద మడుల్లో నీరు చేరిందని తెలిపారు.

తంపర పొలాల ముంపు

రేగిడి: మండలంలోని వన్నలి- చాటాయివలస మధ్య ఉన్న బండిగెడ్డ తంపర పొలాలు ఎడతెరిపిలేని వర్షాలకు శనివారం ముంపునకు గురయ్యాయి. ఈగెడ్డకు మరమ్మతులు లేకపోవడంతో వర్షాలు కురిస్తే వన్నలి, చాటాయివలస, అక్కన్నఆగ్రహారం, మాధవరాయపురం, అంబఖండి, ఉంగరాడ తదితర గ్రామాల్లో 300 ఎకరాల ఆయకట్టుకు వరద ముప్పు పొంచిఉంది. ప్రస్తుతం ఈ గెడ్డ పరిధిలో ఉన్న ఆకు మళ్ల ముంపునకు గురికాగా, వర్షాలు ఇంకా కొనసాగితే ఆకుమళ్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 50 ఎకరాల వరి ఆకుమళ్లు నీటిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

1200 ఎకరాల్లో పొలాలు..

వంగర:భారీ వర్షాలకు మగ్గూరు,మద్దువలస, సంగాంల్లో వరి పంటలు నీట మునిగాయి. మద్దువలస ఎడమకాలువ నీటితో పాటు వర్షం నీరు పొలాల్లోకి చేరింది. నీరుబయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో 1200 ఎకరాలు పంటలు నీటమునిగాయి. గతంలో ఇక్కడ పంట భూముల నుంచి నీరు నేరుగా నాగావళి కి చేరడానికి కాలువ ఉండేది. అది పూడుకుపోవడంతోపాటు కొందరు కాలువను ఆక్రమించడంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నిలిచిన నీరు నాగావళి నదిలోకి వెళ్లేందుకు ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

39 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

విజయనగరం రూరల్: విజయనగరం మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకూ 39.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.మూడురోజులుగా కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి విజయనగరం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, గెడ్డల్లో నీరుచేరింది.కొండకరకాం, దుప్పాడ, ద్వారపూడి, పినవేమలి, రాకోడు తదితర ప్రాంతాల్లో మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం నీరు ఎక్కడిక్కడే నిల్వఉంది. లేఅవుట్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయింది. కాలువల్లో నీరు రోడ్లపైకి వచ్చింది.

లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు: విజయనగరంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు పర్యటించారు. 6, 12, 35, 37, 59 సచివాలయాల పరిధిలో జరుగుతున్న పారిశుధ్య, కాలువల్లో పూడిక తీత పనులు, నేలవిరిగిన చెట్లను తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పూడిక పారిశుధ్య సిబ్బందితో తీయిం చారు.ఆయన వెంట డీఈ అప్పారావు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల ఆవరణలో వర్షం నీరు

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ పాఠశాల చుట్టు వర్షం నీరుచేరింది.అయితే శనివారం ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో తరచూ అవస్థలు తప్పడంలేదని హెచ్‌ఎం కుమరాపు చంద్రినాయుడు తెలిపారు. పాఠశాలకు కొత్తభవనం మంజూరు చేయాలని అధికారులకు కోరినాచర్యలు తీసుకోవడంలేదని చెప్పారు.వర్షంకురిస్తే 30మంది విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. కాగా ఈ పాఠశాలకు సంబంధించి నాడు-నేడులో ప్రతిపాదనలు ఉన్నాయనిఎంఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


పాఠశాల ఆవరణలో చేరిన నీరు

కుమార్తెపై అత్యాచార యత్నం

● తండ్రిపై పోక్సో కేసు ● నిందితుడి అరెస్టు

బొబ్బిలి:బొబ్బిలిలో శుక్రవారం కుమార్తెపై(11)ఇంట్లోనే తండ్రి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఓ సామాజిక కార్యకర్త సహకారంతో బాధితురాలి అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. సమాచారం తెలియగానే బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు సిబ్బందితో సహా ఘటనా స్థలానికి శనివారం చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. బాధితురాలైన బాలికకు వైద్యపరీక్షలు చేసి, ఎటువంటి గాయాలులేవని వైద్యులు నిర్ధారించారు. వినికిడిలోపంతో బాధపడుతున్న బాధితురాలితో పాటు ఆమె చెల్లెలిని బాల సదన్‌కు అప్పగించారు. ఈమేరకు తండ్రిపై పోక్సో చట్టం, భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసులు నమోదుచేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేశామని చెప్పారు. కాగా బాలికపై అత్యాచారయత్నంపై హోంమంత్రి అనితతోపాటు, స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనలు తక్షణమే స్పందించారు. బాధితురాలికి సత్వర న్యాయం జరగాలని, నిందితుడికి కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని పోలీసులకు ఆదేశాలిచ్చారు.

కూలిపోయిన రెండు పూరిళ్లు

లక్కవరపుకోట: మండలంలోని దాసుల్లుపాలెం, కుద్దువలసల్లోని రెండు పూరిళ్లువర్షాలకు కూలిపోయాయని తహసీల్దార్‌ప్రసాద్ తెలిపారు. కుద్దువలసలో పెదిరెడ్డి సింహాద్రి పూరిల్లు, దాసుల్లుపాలెం గ్రామానికి చెందిన కుంచంగి దేముడమ్మ పూరిపాక కూలిపోయినట్లు చెప్పారు. కూలిపోయిన సమయంలో ఇంట్లోఎవరు లేకపోవడంతో ప్రమాదం జరగలేదని తెలిపారు. బాధితులకు పునరావాస చర్యలుచేపట్టామని, అధికారులకు నివేదిక పంపించామమని చెప్పారు.

రెండు స్తంభాలు నేలమట్టం

రేగిడి:వర్షాలకు రేగిడి మండలంలో పుర్లి, కొమిరిల్లో శుక్రవారం రాత్రి రెండు విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. స్థానికులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.పుర్లిలో స్తంభాన్ని శనివారం సిబ్బంది పునరుద్ధరించగా, కొమిరిలో పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ ఎల్.హరిబాబు తెలిపారు.

ఇసుక దందాల నియంత్రణకు పికెట్

రేగిడి:బొడ్డవలస, కొమిరి వెంకటాపురం, రేగిడి నాగావళి నదీ తీరాల నుంచి ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు స్థానిక పోలీసు, రాజాం ఎస్ఈబీ శాఖలు సంయుక్తంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. అనుమతుల లేకుండా వెళ్తున్న లారీలు, ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నవధాన్యాలతో నేలసారం: జేడీ


నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న రామారావు

విజయనగరం రూరల్:నవధాన్యాల సాగువిధానం వల్ల నేల సారం మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు తెలిపారు. శనివారం విజయనగరం మండలంలోని జొన్నవలసలో పూసపాటి అప్పల నరసింహారాజు, పీవీఎస్ రాజు తదితరులు60 ఎకరాల్లో చేస్తున్న నవధాన్యాల సాగును జేడీతోపాటు డీపీఎం ఆనందరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు నాగభూషణం, ఏవో ఎం.ఉమామహేశ్వరనాయుడు తదితరులు పరిశీలించారు.ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ఈ సాగు వల్ల ఎరువులు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో రైతుకు అధిక ఆదాయం వస్తుందని, సమతుల్యమైన ఆహారం పొందవచ్చని తెలిపారు.

తాటి పండ్లతో ద్రవ జీవామృతం

రాజాం: రాజాంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గౌరీశ్వరరావు వంగర మండలం కొత్తవలసలో తాడిపండ్లతో 200 లీటర్ల ద్రవజీవామృతాన్ని తయారు చేశారు.జీవామృతం ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, ఏపీఎం టి.మంగమ్మ, వీఏఏ శివ పాల్గొన్నారు


జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

రుణాల సమస్యను పరిష్కరించాలి

●ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు

కలెక్టరేట్: జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సంబంధించి ఏపీజీఎల్ఐ రుణాలు, చివరి పేమెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయులు సంఘం నాయకులు టి.సన్యాసిరాజు కోరారు. శనివారం ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం అసిస్టెంట్‌డైరెక్టర్ జి.షైమావతికి వినతిపత్రం అందజేశారు. రుణాలు, చివరి పేమెంట్ల సమస్యల వల్ల ఉపాధ్యాయులు చాలా ఇబ్బందిపడుతున్నారని వివరించారు. అలాగే ఏపీజీఎల్ఐ సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లాలోని ఏపీటీఎఫ్(1938) ఆధ్వర్యంలో సంఘ నాయకులు శనివారం ఏడీకి వినతిపత్రం అందజేశారు.కొన్నినెలల నుంచి ఉద్యోగ విరమణ చేసివారికి చివరి డబ్బులు చెల్లించాలని, రుణాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రీమియం సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలోని సంఘ నాయకులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

బొబ్బిలి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని బ్యాంకు ఆఫ్ బరోడా మేనేజరు రమేష్ పిలుపునిచ్చారు.బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో బ్యాంకు ఆఫ్ బరోడా 117వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మొక్కలు నాటారు. విద్యార్థులు, ఐటీఐ సిబ్బందికి, బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు మేనేజరు రమేష్ మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీఐ ఇన్‌చార్జి యుగంధర్, రాములప్పడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంత విద్యారంగ సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణికుమార్ బేబీనాయనను ఆయన స్వగృహంలో కలుసుకొని వినతిపత్రం అందజేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, జీవో-77ని రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, 107, 108 జీవోలను రద్దు చేసి కన్వీనరు కోటాలో సీట్లు భర్తీ చేయాలని కోరారు. సమస్యలపైనా ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబీనాయన వారికి హామీఇచ్చారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

శృంగవరపుకోట/లక్కవరపుకోట:ఎస్.కోట పంచాయతీ వార్డుసభ్యుడు, టీడీపీ కార్యకర్త అనకాపల్లి చెల్లయ్య కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఎన్నికల సమయంలో జరిగిన నిశ్చితార్థానికి ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. ఆ సమయంలో ఇచ్చిన మాట మేరకు శనివారం నగదు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్‌నాయుడు,కొల్లి రమణమూర్తి, వెంకటరత్నాజీ,చక్క కిరణ్‌కుమార్, కాపుగంటి వాసు, వాకాడ బాలు, మురళి, సూరప్పరావు పాల్గొన్నారు.


గిరిప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనం


తొలి పావంచావద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్త జనసంద్రం

- సింహగిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు
- లక్షలాది మంది రాక
- ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- కొండంత భక్తితో కాలినడకన గిరి ప్రదక్షిణ

విశాఖపట్నం, సింహాచలం, జూలై 20 (ఆంధ్రజ్యోతి):ఓం నమో నారసింహ. పాహిమాం...పాహిమాం...పాహి గోవిందా...గోవింద!!. అంటూ భక్తుల నామస్మరణతో శనివారం సింహగిరి పులకించిపోయింది. గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం, అడవివరం ప్రాంతం జనసంద్రమైంది. ఉదయం వేలల్లో మొదలైన భక్తుల సంఖ్య సాయంత్రానికి లక్షలకు చేరుకుంది. ప్రదక్షిణ మార్గం జన ప్రవాహంతో కిక్కిరిసింది. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి చుట్టూ శనివారం లక్షలాది మంది భక్తులు ప్రదక్షిణలు చేశారు. జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన సమయం కంటే ముందుగానే వేలాది మంది భక్తులు శనివారం ఉదయం ఎనిమిది గంటలకే సింహాచలం తొలిపావంచావద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు అధికారులు నిర్ణయిం చిన సమయానికి అంటే సాయంత్రం నాలుగు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. పుష్పతేరులోని స్వామి వారికి అర్చక స్వాములు పూజలు చేసి అశోక్‌గజపతిరాజుకు తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. అనంతరం ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి జెండాను ఊపి సింహగిరి ప్రదక్షిణకు అశోక్‌గజపతిరాజు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తేరుకు ముందుభాగాన దేవస్థానం అధికారులు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సింహాచలం తొలి పావంచా వద్ద ప్రారంభమైన పుష్పతేరు (పూల రథం) పాత అడివివరం, హనుమంతువాక, జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం, గురుద్వారా, మురళీనగర్ కూడలి, ఎన్ఏడీ, గోపాలపట్నం బంక్, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం తొలిపావంచాకు చేరుకుంది. పూలరథాన్ని లక్షలాది మంది భక్తులు అనుసరించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మాత్రమే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రూపొందించి ప్రణాళికల ప్రకారం దేవస్థానం అధికారులు తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన 80 ఇనుప గడ్డర్లపై భక్తులు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలను కొట్టారు. వాటిని పోగుచేసుకునేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేక వాహనాలను, పనివార్లను వినియోగించారు. కొంతమంది భక్తులు సింహగిరి ప్రదక్షిణను ముగించుకుని రాత్రి తొమ్మిది గంటలకే తిరిగి తొలిపావంచాకు చేరుకున్నారు.

భక్తులకు స్వచ్ఛంద సంస్థల సేవలు

తొలి పావంచా మొదలుకొని పాత అడివివరం, హనుమంతువాక, హెచ్‌బీ కాలనీ మీదుగా గోపాలపట్నం వరకూ భక్తులు నడిచే మార్గాల్లో సేవాసంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి అల్పాహారం, మజ్జిగ, బాదంపాలు, టీ, కాఫీలు, తాగునీరు సరఫరా చేశాయి. అలసిపోయిన భక్తుల కాళ్లకు సత్యసాయి సేవా సంస్థల సిబ్బంది సుమారుగా వంద మంది ప్రత్యేకంగా తయారుచేసిన నూనెతో మర్దనా చేసి సాంత్వన చేకూర్చారు.

ఎస్.కోట సీహెచ్‌సీపై నివేదిక

శృంగవరపుకోట: ఎస్.కోట సీహెచ్‌సీలో రోగులకు అందజేస్తున్న సేవలు తదితర అంశాలపై శనివారం ఆంధ్రజ్యోతిలో రిఫర్ టూ విజయనగరం శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. ఈ మేరకు శనివారం ఈ విషయంపై జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ గౌరిశంకరరావును వివరణ కోరారు. దీనిపై స్పందించిన సమన్వయాధికారి ఎస్.కోట సీహెచ్‌సీ వైద్యాధికారి వివరణ కోరి నివేదిక రూపొందించి కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం కాలానుగుణంగా చికిత్సకోసం ఏజెన్సీఇతర ప్రాంతాలనుంచి వచ్చేరోగులకు పీహెచ్‌సీలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రి వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో రేడియాలజిస్ట్ సేవలు వారంలో ఆరురోజులు అందుబాటులో ఉంచడంతో పాటు సదరు రేడియాలాజిస్టుకు ఇతర విధులు అప్పగించొద్దని ఆదేశాలు జారీచేశారు. ఒకకేసును రిఫర్‌చేసే సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్,ఆర్ఎంవోల అనుమతి, సీనియర్ డాక్టర్ల సలహాలు లేనిదే రిఫర్ చేయవద్దని డీసీహెచ్ఎస్ తెలిపారు. ఏదైన అత్యవసర కేసులు రిఫర్ చేయాల్సి వస్తే 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్‌చేయాలన్న ఆదేశాలను జిల్లా సమన్వయకర్త ఇచ్చారు.ఈవిషయాలపై ఆసుపత్రిలో జరిగే అంతర్గత సమావేశాల్లో వైద్యులు, సిబ్బందికి తగు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

29 నుంచి రైతు సమ్మేళనం

కొత్తవలస: వ్యవసాయం నిలవాలి, రైతు గెలవాలన్న నినాదంతో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనాన్ని ఈనెల 29, 30, 31 తేదీల్లో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు తెలిపారు. శనివారం కొత్తవలసలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతాంగానికి దక్కవలసిన న్యాయమైన వాటాదక్కడం లేదన్నారు.రైతులకు న్యాయం చేసినప్పుడే వ్యవసాయం మనుగడ సాధిస్తుందని తెలిపారు.

నిలకడగా నాగావళి ప్రవాహం

రేగిడి: నాగావళి నదిలో ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రవాహఉధృతి 45 మీటర్లు దాటితే రేగిడి మండలంలో 12 లోతట్టు గ్రామాలకు వరదభయం పొంచిఉంది. శనివారం సాయంత్రానికి సంకిలి నదీవంతెన వద్ద ప్రవాహ ఉధృతి 43.2 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్, సిడబ్ల్యుసీ సిబ్బంది అంచనావేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

శృంగవరపుకోట రూరల్: ధర్మవరంలోని సరపు బందను ఆక్రమించి, కొందరు అద్దెకు ఇచ్చి చేపల పెంపకం చేయిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆ బంద వద్ద పంచాయతీ ఈవో రంగారావు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.ఈ విషయమై ఈవో మాట్లాడుతూ గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై విచారణ చేపట్టి.. బంద వద్ద బోర్డు పెట్టామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో చదరంగం పోటీలు

బొబ్బిలి: ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విద్యాసంస్థలో శనివారం నిర్వహించిన చదరంగం పోటీలను ఎమ్మెల్యే బేబీనాయన తిలకించారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లతో ఎక్కువ కాలం గడిపే నేటితరం విద్యార్థులకు చదరంగం మంచి మేథను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రౌతు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వారపుసంత వేలంపాట ఖరారు

కొత్తవలస: కొత్తవలస మంగళవారం జరిగే వారపు సంత ఆశీలు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన వేలంపాటను అధికారులు ఖరారు చేశారు.శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పాటలో మిందివలస రామచంద్రపురానికి చెందిన పొలమరశెట్టి గంగరాజుకు రూ.6,36,910 లకు ఖరారు చేసినట్లు ఎంపీడీవో రమణయ్య తెలిపారు. పాట మార్చిలో జరగాల్సిఉండగా ఎన్నికల కోడ్ వల్ల వాయిదాపడింది. దీంతో జిల్లా, మండలపరిషత్‌కు చెందిన సిబ్బందే నాలుగు నెలలపాటు సంతలో ఆశీలు వసూలుచేశారు. గత సంవత్సరం ఈ పాట రూ.5,78,100కు పాడుకోగా గతసంవత్సరం పాటపై 10 శాతం పెంచి ఈ సంవత్సరం పోలమరశెట్టి గంగరాజుకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ ధర్మారావు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే

తెర్లాం: దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభు త్వం గ్రామాలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. శనివారం మండలంలోని జగన్నాథవలసలో టీడీపీకార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గత ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. తాగు, సాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు. తాగునీరు, రహదారి, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు నరుశుపల్లి వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు బొల్లి భవాని, రామినాయుడు, మావిడి రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బేబీనాయన

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

రామభద్రపురం: వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రామభద్రపురం ప్రాథమిక ఆర్యో కేంద్రం వైద్యాధికారి పులి దిలీప్‌కుమార్ సూచించారు.శనివారం నేరెళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

లక్కవరపుకోట (వేపాడ): వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని బొద్దాం పీహెచ్‌సీ జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ తెలిపారు. శనివారం బొద్దాం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవిని గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కేజీపూడి సచివాలయ పరిధిలోని మలేరియా కేసులను పరిశీలించారు. మలేరియా జ్వరాలు, డెంగ్యూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వో తిరుపతిరావు, మూర్తి పాల్గొన్నారు.


పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షిస్తున్న శాంతిప్రభ

ధాన్యం రవాణా చార్జీల చెల్లింపునకు అంగీకారం

జామి: జామి, అన్నంరాజుపేట సొసైటీల ద్వారా 2021-22 సంవత్సరాలకు గాను జరిగిన ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల రవాణాచార్జీల చెల్లింపునకు ఆయా సొసైటీలు అంగీకరించాయి.రెండు సొసైటీల ద్వారా రూ.10లక్షలు చెల్లించలేదు. వీటిని రైతులకు చెల్లించాలని రెండేళ్లుగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు పోరాడుతున్నారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆయన సంబంధిత జిల్లా అధికారులతో పాటు కలెక్టర్‌ను సంప్రదించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ఎట్టకేలకు రైతులకు ఇవ్వాల్సిన రవాణాచార్జీలు చెల్లింపునకు సంఘాలు ఒప్పుకున్నాయి.తన పోరాటానికి అండగా నిలిచిన మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి పెదబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి:డీఈవో

వంగర: నాడు-నేడు ఫేజ్ 2లో మంజూరైన వీవీఆర్‌పేట పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సుచించారు. పాఠశాల పనులు చేయకుండా బిల్లులు దుర్వినియోగం చేశారని డీఈవోకు ఇటీవల గ్రామానికి చెందిన చినపైడిపినాయుడు ఫిర్యాదుచేశారు. దీంతో శనివారం వీవీఆర్‌పేట జడ్పీ పాఠశాలలో డీఈవో బృందం విచారణ జరిపింది. తొలుత పనుల బిల్లులు చెల్లింపు వివరాలు తెలుసుకున్నారు. నిధుల వినియోగం జరిగిన పనులు పరిశీలించిన తర్వాత, పనులు త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఎంకు సూచించారు. త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో దుర్గారావుకు కోరారు. ఆయన వెంట ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ వేణు పలువురు అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

డ్రగ్స్‌ను అరికట్టాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భారతి

శృంగవరపుకోట: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం డ్రగ్స్ అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భారతి, ఉప కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం ఎస్.కోటలో గంజాయి, డ్రగ్స్‌ను ప్రభుత్వం నివారించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అను, చైతన్యనాయుడు, చరణ్, పార్వతి, అనూష, శిరీష పాల్గొన్నారు.


ఎస్.కోట దేవికూడలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అభివృద్ధే ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే బోనెల



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్: పార్వతీపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా అసెంబ్లీలో ప్రస్తావించనున్న కొన్ని సమస్యలపై ఆయన వెంకంపేటలో ఉన్న క్యాంప్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. జంఝావతి హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరుతానని చెప్పారు. బైపాస్ రహదారి నిర్మాణం, సీతానగరం వంతెన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరినట్టు తెలిపారు.

వినతుల స్వీకరణ..

ఎమ్మెల్యే విజయచంద్ర శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. తాగునీరు, విద్యుత్‌లో లోటట్టేజ్, పారిశుధ్యం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి వినతులు అందాయి. వెంటనే ఫోన్‌లో అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

అక్రమ క్రషర్‌పై చర్యలు తీసుకోండి

సీతానగరం: నూరంపేట గ్రామంలో ఒక వైసీపీ నాయకుడు నిబంధనలకు వ్యతిరేకంగా క్రషర్‌ను నిర్వహిస్తున్నట్టు పలువురు ఎమ్మెల్యే విజయచంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఆ క్రషర్‌ను పరిశీలించారు. క్రషర్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఫోన్‌లో అధికారులకు ఆదేశించారు. వెంటనే అధికారులు క్రషర్ వద్దకు పరుగులు తీశారు. చర్యల ప్రక్రియ ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు వేణు, సత్యంనాయుడు, నాగభూషణం ఉన్నారు.

సీతానగరం ఆనకట్ట నుంచి నీరు విడుదల

సీతానగరం మండలంలోని సీతానగరం ఆనకట్ట నుంచి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం నీరు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆనకట్ట ద్వారా 3,800 ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. సుమారు 6వేల ఎకరాలకు నీరందేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట సత్యం, వేణు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తెంటు వెంకటప్పనాయుడు, శేఖర్, నాగభూషణ్, డీఈ తిరుమలరావు, ఏఈ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంఝావతి నుంచి సాగునీరు

గరుగుబిల్లి: మండలంలోని కాలువలకు జంఝావతి ప్రాజెక్టు నుంచి సాగు నీరు సరఫరా చేశారు. దీంతో కొంకడివరం సమీపంలోని సీతారాంపురం నుంచి ఉల్లిభద్ర మీదుగా తులసిరామినాయుడువలస ప్రాంతానికి శనివారం నీరు చేరుకుంది. అయితే కాలువ పరిధిలో అధికంగా పిచ్చి మొక్కలు నెలకొనడంతో సాగునీరు దిగువకు వెళ్లే పరిస్థితి కనిపించకపోవడంతో గొట్టివలస, గరుగుబిల్లి, ఉద్దవోలు, పెద్దూరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉపాధి హామీలో కాలువలు శుభ్రం కోసం ప్రతిపాదనలు చేసినా పనులు ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. అధికారులు దృష్టి సారించి శివారు ప్రాంతాలకు సాగునీరు సరఫరా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు

పార్వతీపురంటౌన్: కళాశాలల్లో ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు తప్పవని రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వేదాంత జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే దిశా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య జాస్పిన్, ఏపీపీ జి.వెంకటరావు, లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.అప్పారావు, సీనియర్ అధ్యాపకులు వివేకానంద, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమర్థవంతంగా నిర్వహించండి

కురుపాం: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సామాజిక తనిఖీ సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.అప్పారావు సమాజిక తనిఖీ బృందాన్ని కోరారు. మండలంలో సామాజిక తనిఖీ నిర్వహించనున్న సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఏపీవో పి.బావాజీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులకు వేతనాల ద్వారా రూ.16 కోట్ల, 96 లక్షల, 59వేల 739, మెటీరియల్ వర్కుల నిమిత్తం రూ.19 కోట్ల 95 లక్షల 20వేల 695 ఖర్చు చేశామని తెలిపారు. దీనికి సంబంధించిన సామాజిక తనిఖీ కోసం పంచాయతీ పరిధిలోని వచ్చే తనిఖీ బృందాలకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సురేష్ నాయుడు, ఎస్ఆర్‌పీలు దాసు, మాధవరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: ప్రజల సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. ఎంపీపీ రమణమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడానికి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. రామవరం సర్పంచ్ పి.సత్యం మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం నాణ్యత లోపాలతో ఉందని, గచ్చు కుంగిపోయిందని, దానిపై చర్యలు తీసుకోవాలని జేఈఈకి తెలియజేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండిపోయారన్నారు. దానిపై పంచాయతీరాజ్ డీఈ, కాంట్రాక్టర్‌కు తెలియజేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో పలు చోట్ల విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని.. నిత్యం వీధి లైట్లు వెలుగుతూ ఉండిపోతున్నాయని పెదభోగిలి సర్పంచ్ తెరిజమ్మ మండల విద్యుత్ శాఖ అధికారికి తెలిపారు. దీనిపై స్పందిస్తూ సీతానగరంలో లోవోల్టేజీ ఉందని, దీనికై 160 ట్రాన్స్‌ఫార్మర్ వేయగలిగితే కొంత సమస్య తీరుతుందని ఎమ్మెల్యే దృష్టిలో పెట్టారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ, ఎంపీడీవో ఈశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంపై విచారణ

సాలూరు: రామాకాలనీలో ఉన్న మూడో అంగన్‌వాడీ కేంద్రం పనితీరుపై శనివారం ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ కేంద్రం నుంచి సేవలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అనే విషయాలను బాలింతలు, గర్భిణులతో పాటు తల్లులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో తక్కువ మంది బాలింతలు, పిల్లలు, గర్భిణులు ఉండగా యాప్‌లలో మాత్రం అధిక సంఖ్యలో అప్‌లోడ్ చేయటాన్ని చూసి పీడీ సిబ్బందిని ప్రశ్నించారు. ఈ విషయంపై చాలాసార్లు సీడీపీవో సత్యవతి దృష్టికి తీసుకు వెళ్లానని, ఆమె పట్టించుకోవద్దని చెప్పటంతో వదిలేశానని సూపర్‌వైజర్ భారతి తెలిపారు. నెలల తరబడి అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధ ఇలా యాప్‌లలో హాజరును తప్పుగా పంపుతుంటే దిగువ స్థాయి సిబ్బంది పట్టించుకోకపోవటం పట్ల పీడీ అసహనం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ తర్వాత మొత్తం విషయాన్ని, తీసుకున్నచర్యలను తెలియజేస్తానని విలేకరులకు చెప్పారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.వి.ఎస్.కుమార్ కోరారు. మన్యం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. కరోనా సమయంలో కార్మికులకు రూ.10వేల వంతున ఇస్తామని చెప్పి మోసగించారని ఆరోపించారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది కాబట్టి అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గెడ్డలు, వాగులు ప్రవాహ ఉధృతి దృష్ట్యా ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని కోరారు. పాఠశాలలకు సెలవు ప్రకటించామని తెలిపారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప స్థానికులు గెడ్డలు దాటవద్దని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో శిథిల భవనాల్లో ఉండవద్దని కోరారు.

ప్రజలు బయటకు రావొద్దు



పాలకొండ: నదీతీర గ్రామాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాలకొండ: నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. మండలంలోని అంపిలి, అన్నవరం గ్రామాల వద్ద నదీతీర ప్రాంతాన్ని ఆయన శనివారం పర్యటించారు. మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు పడనున్నాయని, నాగావళి నది పొంగే అవకాశం ఉందని చెప్పారు. ప్రజలు ఏదైనా అవసరం ఉంటే తప్ప బయటకు రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పూరిపాకల్లో ఉండవద్దని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, ఈవోఆర్డీ సూర్యనారాయణ, వీఆర్వో సౌజన్య, పంచాయతీ కార్యదర్శి శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: ఏడు ఖానాల వద్ద వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

వరదనీటి మళ్లింపునకు చర్యలు

పార్వతీపురంటౌన్: వరహాల గెడ్డ వరదనీటి మళ్లింపునకు తక్షణమే చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ కాలనీ గుండా వెళ్లే వరహాల గెడ్డ శివారు ప్రాంతమైన ఏడు ఖానాల వద్దగల వ్యర్థాల తొలగింపును ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరహాల గెడ్డ వరద ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా గెడ్డలోని వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తామని చెప్పారు.

పద్మశ్రీ కమలా పూజారి మృతి



కమలా పూజారి (ఫైల్)

సాలూరు రూరల్: ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలో కుగ్రామంలో పుట్టి దక్షిణాఫ్రికా అవార్డు, భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు పొందిన గిరిజన మహిళా రైతు కమలా పూజారి శనివారం మృతిచెందారు. ఆమె గుండె, మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్నారు. ఆమెకు చికిత్స అందించేందుకు కటక్ ఎస్సీబీ ఆసుపత్రిలో ఒడిశా ప్రభుత్వం చేర్పించింది. నలుగురు వైద్యబృందంతో సేవలందించింది. ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు ఎస్సీబీ వైద్యులు ప్రకటించారు. ఆమె స్వగ్రామం పాత్రపుట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఒడిశా ప్రజలు ఆమెను మరవబోరని సీఎం మోహన్ మాఝి అన్నారు. ఆమె మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

నెల్లిమర్ల ఎమ్మెల్యేను కలిసిన జనసేన నాయకులు



ఎమ్మెల్యే మాధవితో జనసేన నాయకులు

గుమ్మలక్ష్మీపురం: నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిని కురుపాం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు శనివారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జనసేన చేస్తున్న కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు అనీల్, వంశీ పాల్గొన్నారు.

పవన్ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మక్కువ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సాలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గేదెల రిషివర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జనసేన కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు వెంపడాపు సుగుణేశ్వరరావు, బోను పాపారావు, అల్లు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

జియ్యమ్మవలస: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మణరావు, జిల్లా సహాయక కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. ఆర్ఆర్‌బి పురంలో ఉన్న టీడబ్ల్యూహెచ్ పాఠశాలను వారు శనివారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, హెచ్‌ఎం త్రినాథరావుతో చర్చించారు. పాఠశాలలో నాడు-నేడు నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్ పాడైన నేపథ్యంలో దానిని త్వరగా బాగు చేయాలని డిమాండ్ చేశారు. కాస్మొటిక్ చార్జీలు మంజూరు చేయాలన్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి డైట్ బిల్లులు మంజూరు కాలేదని, వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని కోరారు.

బాలాత్రిపుర సుందరి పట్టాభిషేక మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: లలితా బాలాత్రిపుర సుందరి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ పూజలు సాలూరులోని పంచముఖేశ్వర ఆలయంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. లలితా పారాయణంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వెలవలపల్లి వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతులకు లాభాలు

గరుగుబిల్లి: ప్రకృతి సాగు చేసే రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఎన్ఎఫ్ఏ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం దళాయివలస గ్రామంలో నవధాన్యాలకు చెందిన పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఎకరాకు 4 టన్నుల పచ్చిరొట్ట ఎరువులు లభ్యమవుతాయన్నారు. ప్రకృతి పద్ధతుల్లో 20 నుంచి 30 రకాల విత్తనాలను 40 రోజుల్లోపు కలియ దున్నడంతో ప్రధాన పంటలకు కావలసిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో ఖరీఫ్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. పంట కోత ప్రయోగంలో 5ఇంటూ5 మీటర్లకు 24 కిలోల దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డీకే బ్రహ్మం, సత్యనారాయణ, గౌరునాయుడు, తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు

పాచిపెంట: నవధాన్యాల సాగు చేయడంతో భూసారం మెరుగుపడుతుందని ఏవో కె.తిరుపతిరావు తెలిపారు. గోగాడవలసలో నవధాన్య పచ్చిరొట్ట విత్తనాల సాగును ఆయన శనివారం పరిశీలించారు. నవధాన్యాల సాగు వలన నేల సారవంతంతో పాటు పశువులకు కావలసిన పచ్చి మేత, ఇంటికి కావలసిన కూరగాయలు కూడా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య ప్రతినిధులు శారద, యశోదమ్మ, శ్రీనివాస్, తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై వివరించండి

వీరఘట్టం: మండలంలోని వెలుగు కార్యాలయంలో శనివారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామ సంఘాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళా సంఘ సభ్యులకు పారిశుధ్య నిర్వహణపై వివరించాలన్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిపై గ్రామ సంఘాల సభ్యులకు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శివనాయుడు, సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడదాం

గరుగుబిల్లి: భావితరాల బంగారు భవిష్యత్తు కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందని గొట్టివలస సర్పంచ్ బోను చంద్రినాయుడు అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగంపై పంచాయతీ కార్యదర్శి తిరుపతి భాస్కరరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు ఆరోగ్యానికి హానికరం

వీరఘట్టం: నడుకూరు గ్రామంలో ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం శనివారం దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అమ్మితే జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. **సీతంపేట:** సీతంపేటలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని ఈవోపీఆర్డీ కె.సత్యం కోరారు. శనివారం మండల కేంద్రంలోని షాపుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. షాపుల వద్ద చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం:ప్లాస్టిక్ కవర్లు అమ్మవద్దని సూచిస్తున్న ఎంపీడీవో

వ్యర్థాలతో గణపతి ఆకృతి

ఒడిశా



విద్యార్థులు ఆవిష్కరించిన గణపతి ఆకృతి

రాయగడ: ఆలోచనలకు పదునుపెట్టి ఆచరణలోకి దిగితే పనికిరాని వ్యర్థాల నుంచి కూడా సుందరమైన ఆకృతులను తయారు చేయవచ్చని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ విద్యార్థులు నిరూపించారు. ఈ మేరకు ఐటీఐలో వ్యర్థంగా పడి ఉన్న చెత్తాచెదారం వంటి వ్యర్థపదార్థాల నుంచి గణేషుని ఆకృతిని ఆవిష్కరించారు. ఈ ఆకృతి తయారు చేయడానికి 20 మంది ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ ప్రిన్సిపాల్ అతుల్య కుమార్ పండా వీరిని అభినందించారు.





క్లుప్తంగా..

అసెంబ్లీ సమావేశాలకు కురుపాం ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 22న జరగబోయే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బయలుదేరి వెళ్లారు. గిరిజన ప్రాంతంలో కొండ శిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణం పూర్తపాడు, లాబేసు వంతెన పనులు పునరుద్ధరించడం, నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలపై ప్రస్తావించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెలలో వర్షాలు బాగా పడడంతో పొలాల్లో నీరు చేరింది. ఈనేపథ్యంలో గిరిజన రైతులు, వ్యవసాయ పనులను చురుగ్గా చేపడుతున్నారు. కొండ శిఖర గ్రామాల్లో గిరిజన రైతులు పోడు వ్యవసాయ పనులు కూడా ప్రారంభించారు.

వేతనాలు అందించాలి

గుమ్మలక్ష్మీపురం: వైటీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు 18 నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌తో సహా మిగతా కింది స్థాయి ఉద్యోగులకు, గర్భిణుల వసతి గృహ సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బరోడా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ: బరోడా బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని పాలకొండ బ్రాంచ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఎం ఎల్.అశోక్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంకు కొత్తగా ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. బ్యాంకు మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

సాలూరు: విదేశాల్లో నివాసం ఉంటున్న కంచర్ల కుటుంబం.. బలగ గణేష్ మాస్టర్ ద్వారా పట్టణంలో ఉన్న మహాత్మా జ్యోతీరావుపులే పాఠశాలకు సుమారు రూ.60వేలు విలువైన ఫ్యాన్లు, ఆట వస్తువులను శనివారం అందజేశారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పాపారావు మృతికి సంతాపం

పాలకొండ: పాలకొండ ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా యూనియన్ మాజీ అధ్యక్షుడు కూన పాపారావు మృతిపై పాలకొండ జర్నలిస్టులు శనివారం సంతాపం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

పాలకొండ: నక్కలపేటలోని షిర్డీసాయి సమేత సకల దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా కొండలరావు శనివారం మాట్లాడారు. విశేష పూజలు, క్షీరాభిషేకం, గురువులకు సన్మానాలకు ఉంటాయన్నారు. ● **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకి సేవ నిర్వహించనున్నారు. ● **వీరఘట్టం:** వీరఘట్టంలోని తెలగ వీధిలో షిర్డీసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు షిర్డీసాయి సేవా సంఘ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు హాజరై పూజల్లో పాల్గోవాలని కోరారు.

సెలవులు సకాలంలో ఇచ్చేలా చూడండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: తుఫాన్ కారణంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసిందని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ తెలిపారు. సెలవు సకాలంలో ఇవ్వకపోవడం వల్ల దూర ప్రాంతం నుంచి రావాల్సిన విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. మధ్యాహ్నభోజన నిర్వాహకులు కూడా ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఇక ముందు సెలవులు ఇచ్చే పరిస్థితి వస్తే ఆ అధికారం ఎంఈవోకి, ఉన్నత పాఠశాల హెచ్ఎంలకు ఇవ్వాలని సూచించారు. సెలవు ఇచ్చినా కూడా చాలా ప్రాంతాల్లో వర్షం లేదు. అందుకు అందరికీ కాకుండా అవసరమైన వారు ఇచ్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు.

పెదగుడబలో పారిశుధ్య చర్యలు

గరుగుబిల్లి: పెదగుడబ పంచాయతీలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం కాలువల్లో పూడికలు తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లు రమేష్, ఏఎన్ఎం ఎస్.వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300